సాక్షి
కుమురం భీం
సోమవారం, 25, ఆగస్టు, 2025



మితిమీరితే అనర్థమే..!
రైతులు పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులకు ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారి ఆర్థికంగా చితికిపోతున్నారు. 8లో▸



ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు
గోలేటిలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఫైనల్‌లో ఆదిలాబాద్ మహిళా జట్టు, వరంగల్ పురుషుల జట్టు విజేతలుగా నిలిచాయి. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.5 /25.5

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
ఆసిఫాబాద్: మండలంలోని ఉస్మానియా మజీద్‌వాడ, చిలాటిగూడ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ కొరకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సుభాష్ ఒక ప్రకటనలో తెలిపా రు. ఆయా పోస్టులకు 7వ తరగతి పాస్ అయి స్థానికులై ఉండాలని, 44 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి కలవా రు ఈ నెల 25 వరకు సంబంధిత పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఉత్సాహంగా 'తానా పోలా'


కట్టె బొమ్మల ఎద్దులతో చిన్నారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని చిన్నారులు ఆదివారం తానా పోలా పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని మొదట కట్టె బొమ్మలతో తయారు చేసిన ఎద్దులకు పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం పిండి వంటలతో తయారుచేసిన నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్, పండరినాథ్ ఆలయయం వద్ద నుంచి రావులవాడ, పొట్టిశ్రీరాములు చౌక్ మీదుగా అంకమరాజు ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద


నిండుగా ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఆదివారం ఎస్సారెస్పీ నుంచి 50 వేల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4 వేల క్యూసెక్కుల వరద, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మరో 36 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోఉండడంతో అధికారులు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి 71 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.95 మీటర్లు ఉంది. మొత్తం 20.175 టీఎంసీలకు 19.950ల టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు
- ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు

ఆసిఫాబాద్: విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని, జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా వినియోగదారులను చైతన్యపరుస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలో డీఈ, టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ అధికారుల పొలంబాట' కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. జనసామర్థ్యం ఉన్న ప్రదేశాల్లో భద్రత సూచన బోర్డులు ఏర్పాట చేస్తున్నామని, విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ


గెలుపొందిన పతకాలను ప్రదర్శిస్తున్న విష్ణు

మందమర్రిరూరల్: హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో మూడు విభాగాల్లో పాల్గొన్న మందమర్రి పట్టణానికి చెందిన విష్ణు సత్తాచాటాడు. మూడు పతకాలు సాధించాడు. మెన్స్ బాడీ బిల్డింగ్ అండర్–23 విభాగంలో బంగారు పతకం, స్ట్రీట్ మోడల్ అండర్–23 విభాగంలో కాంస్య పతకం, ఫిట్‌నెస్ మోడల్ అండర్–23 విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో 600 మంది పాల్గొన్నారు.

మరిన్ని సంఘాలు

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వాలు 60 ఏళ్లు దాటిన మహిళలకు సంఘంలో చోటు కల్పించలేదు. కానీ ఈ ప్రభుత్వం వృద్ధులకు ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేస్తోంది. కిశోర బాలికలకు, దివ్యాంగులకు సైతం సంఘంలో చోటు కల్పించి వారిని కూడా ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం జిల్లాలోని అన్ని మండలాల్లో సర్వేలు నిర్వహిస్తోంది.

- 60 ఏళ్లు దాటిన మహిళలు, కిశోర బాలికలు, దివ్యాంగులకు చాన్స్
- సభ్యులను గుర్తించే పనిలో ఐకేపీ సిబ్బంది
- నెలాఖరులోగా ఏర్పాటుకు ఆదేశాలు
- దివ్యాంగుల కేటగిరీలో పురుషులకు చోటు



కర్పెతగూడలో వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న సీసీ

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లాలో కొత్తగా మరిన్ని మహిళా సంఘాలు ఏర్పాటు కానున్నాయి. గతానికి భిన్నంగా ఈసారి కిశోర బాలికలు, 60 ఏళ్లు దాటిన వృద్ధులను గ్రూపుల్లో చేర్చనున్నారు. దివ్యాంగులకు సైతం నూతనంగా సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో కోటి మందిని సంఘాల్లో చేర్పించడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. సంఘాల ఏర్పాటు కేవలం ఆర్థిక కోణంలోనే కాకుండా సామాజిక కోణంలో ఆలోచించి వృద్ధులు, కిశోర బాలికలు, దివ్యాంగులను కూడా సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి ఆసరాగా నిలవాలని భావిస్తోంది. సదరు కేటగిరీకి చెందిన వారిని ఈ నెలాఖరులోగా గుర్తించి ఖాతాలు తెరిపించే పనిలో సెర్ప్ ఉద్యోగులు నిమగ్నమయ్యారు.

మహిళా సంఘాల వివరాలు

వీవోలు:	ఎస్‌హెచ్‌జీలు:
398	7,973

సంఘంలోని మహిళలు: 91,772

నూతన సంఘాలు	లక్ష్యం	ఏర్పాటైనవి
దివ్యాంగులు:	225	109
వృద్ధులు:	585	324
కిశోర బాలికలు:	439	248

పొదుపు నిర్ణయం వారిదే..
పొదుపు ఎంత చేయాలనే నిర్ణయం ఆ సంఘంలో ఉన్న సభ్యులదే. సంఘాలుగా ఏర్పడిన వారు ఇంత మొత్తంలో పొదుపు చేయాలనే షరతు ఏమీ లేదు. వారి ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి నెలనెలా కావాల్సినంత పొదుపు చేసుకోవచ్చు. ఇప్పుడున్న పొదుపు సంఘాల మాదిరిగానే ఈ సంఘాలు కూడా నెలకోసారి సమావేశాలు నిర్వహించి పొదుపు డబ్బులు కట్టడం, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవడం, మ్యాచింగ్ గ్రాంటు పొందడం, రికార్డులు నిర్వహణ వంటివి చేసుకోవచ్చు. వీవోఏలు కూడా వీరికి సహకరించనున్నారు.

సంఘం ఏర్పాటు ఇలా..
60 సంవత్సరాలు పైబడిన మహిళలంతా వృద్ధుల సంఘంలో చేరవచ్చు. అయితే ప్రస్తుతం ఏదైన మహిళా సంఘంలో కొనసాగుతున్న వారుంటే చేరనవసరం లేదు. కిశోర బాలికల్లో మాత్రం రెండు గ్రూపులుగా సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. 11 నుంచి 14 సంవత్సరాల వరకు ఒక గ్రూపు, 14 నుంచి 18 సంవత్సరాల వరకు మరోగ్రూపు తయారు చేస్తున్నారు. ఈ సంఘాల్లో కనీసం పదిమంది సభ్యులు ఉండాలి. కానీ దివ్యాంగుల సంఘాల ఏర్పాటుకు 5 నుంచి 10 మంది ఉండే అవకాశం కల్పించాలి. అయితే దివ్యాంగుల సంఘంలో మహిళలతో పాటు పురుషులు కూడా ఒక సంఘంగా ఏర్పడే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది,

సంఘాలు ఎందుకంటే..
సంఘాల్లో ఉన్న ఎంతోమంది మహిళలు పొదుపు డబ్బులు, రుణం ద్వారా కుటీర, ఉపాధి వనరులు, చిన్నచిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటూ కుటుంబ పోషణలో భాగస్వామ్యం అవుతున్నారు. వయస్సు పైబడిన వారు ఇంటికే పరిమితమై తాము ఒంటరిగా ఉన్నామనే ధ్యాసలోపడి మానసిక వ్యథకు గురికాకుండా సంఘంగా ఏర్పడితే వారిలో తన కోసం నలుగురు ఉన్నారనే మానసిక స్థైర్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. కిశోర బాలికలను కూడా సంఘాల్లో చేర్పించి సమాజంలో మంచి, చెడులను తెలుసుకునే అవకాశం కల్పించింది. దివ్యాంగులు కూడా తాము ఎవరికీ తీసిపోమనే విధంగా ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసి అండగా నిలవాలని ప్రభుత్వం భావించింది.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని మండలాల్లో వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికల కోసం నూతనంగా సంఘాల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అన్ని మండలాల్లో ఐకేపీ ఏపీఎం, సీసీలు సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. సంఘాలను గుర్తించి ఖాతాలు తెరిపించి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించాం. ఈ నెలాఖరు వరకు సంఘాల ప్రకియ పూర్తి చేయాలి.

– దత్తారాం, డీఆర్డీవో

బోధించేవారేరి?



ధర్నా చేస్తున్న కళాశాల విద్యార్థులు (ఫైల్)

- మెడికల్ కాలేజీలో అధ్యాపకుల కొరత
- కళాశాలలో 97 పోస్టులు ఖాళీ
- రెండేళ్లయిన భర్తీ కాని వైనం
- విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మెడికల్ కళాశాల ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి కావస్తోంది. అయినప్పటికీ నేటికీ కళాశాలలో పూర్తిస్థాయిలో బోధన సిబ్బందిని నియమించలేదు. ఉన్న వారితోనే ప్రస్తుతం తరగతులు కొనసాగిస్తున్నారు. ఖాళీల భర్తీ కోసం పలుమార్లు నోటిఫికేషన్ ఇచ్చినా జిల్లాలో అనుకున్న సౌకర్యాలు లేకపోవడంతో ఎవరూ ముందుకు రావడంలేదు. అంతేకాకుండా కళాశాల నిర్మాణ పనులు ఇప్పటి వరకు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఉండేందుకు పాత కలెక్టరేట్‌లో వసతి కల్పిస్తున్నారు.

ఆసక్తి చూపడం లేదు
జిల్లాలోని మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు పలుమార్లు దరఖాస్తులు ఆహ్వానించినా ఇక్కడ పనిచేసేందుకు బోధన సిబ్బంది ముందుకు రావడంలేదు. దీంతో ఉన్న వారితోనే చదువులు కొనసాగిస్తుండడంతో అప్పటికే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రొఫెసర్లను నియమించి కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని జనవరి 2న విద్యార్థులు రెండు రోజుల పాటు ధర్నాలు సైతం నిర్వహించారు. సంబంధిత అధికారుల జోక్యం చేసుకుని విద్యార్థులకు నచ్చచెప్పి ఖాళీలు భర్తీ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కానీ ఇప్పటికీ ఖాళీలు భర్తీ చేయలేదు. ద్వితీయ సంవత్సరంలో అడుగుపెట్టినప్పటికీ ప్రొఫెసర్లు లేకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థుల భవిష్యత్‌పై పడుతోంది. దీంతో ఇతర జిల్లా విద్యార్థులతో పోటీపడలేని పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భర్తీ కాని ఖాళీలు...
గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించకుండానే మెడికల్ కళాశాల ప్రారంభించారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం తరగతులు కూడా కొనసాగుతున్నాయి. కళాశాలలో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 200 మంది వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. వారికి విద్యాబోధన చేసేందుకు కళాశాలలో మొత్తం 106 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ కేవలం 9 మంది మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తుండగా 97 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వీటిలో ప్రొఫెసర్లు 27 మందికిగానూ నలుగురు ఉండగా 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు 30 మందికిగానే ఒక్కరే ఉండగా 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 58 మందికిగానూ నలుగురు మాత్రమే ఉండగా 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భర్తీపై దృష్టి సారించాలి
వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకోసం పలుమార్లు నోటిఫికేషన్ ఇచ్చినా అర్హత గల బోధన సిబ్బంది ముందుకు రావడంలేదు. 106 మందికిగానూ ప్రస్తుతం 9 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీల భర్తీపై దృష్టి సారించాలి.

– శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్

చర్యలు తీసుకోవాలి



మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తికావస్తోంది. అయినప్పటికీ నేటికీ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో వైద్య కళాశాల విద్యార్థులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

– తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిబంధనలు పాటించాల్సిందే.!

- గణేశ్ మండపాల వద్ద డీజేలు, లక్కీ లాటరీలు బంద్
- నిర్వాహకులకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచనలు



కాంతిలాల్ పాటిల్, ఎస్పీ

చింతలమానెపల్లి/కౌటాల: మరో రెండు రోజుల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా గణేశ్ ప్రతిమల ను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీ సుశాఖ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించామని, ప్రజలు, మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు
ఉత్సవాలు నిర్వహించే కమిటీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. http:// police portel. tspolice.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని వివరాలు తెలపాల్సి ఉంటుంది.

డీజేలు, లక్కీడ్రాలు నిషేధం
గతేడాది గణేశ్ మండపాల వద్ద నిర్వహించిన పలు లక్కీడ్రా, లక్కీ లాటరీలు విమర్శలకు దారి తీశాయి. నిధుల సమీకరణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినా పలుచోట్ల దుర్వినియోగం జరిగింది. ఆధ్యాత్మికతకు కేంద్రాలుగా ఉండాల్సిన గణేశ్ ఉత్సవాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి. వీటి ద్వారా వసూలైన నగదు పక్కదారి పట్టిందనే ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో పోలీసు శాఖ ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తోంది. ఏరకమైన లక్కీ లాటరీలు నిర్వహించకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని తెలి యజేస్తున్నారు. గణేశ్ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా డీజేలకు అనుమతిలేదని స్పష్టం చేస్తున్నారు.

నిబంధనలు ఇవే..
1. మండపం ఏర్పాటుకు స్థల యజమాని నుంచి అనుమతి తీసుకోవాలి.
2. విద్యుత్ వినియోగానికి ఆశాఖ అనుమతి తప్పనిసరి.
3. ఎలక్ట్రిసిటీ పనులకు నాణ్యతగల వస్తువులనే వినియోగించాలి. షార్ట్ సర్క్యూట్ జ రగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలి.
4. కమిటీలు, కమిటీ బాధ్యత తీసుకునే వారి వివరాలు, ఫోన్ నంబర్లను పోలీసుస్టేషన్లలో అందజేయాలి.
5. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మండపాలను ఏర్పాటు చేయాలి. రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయకూడదు.
6. గణేశ్ ప్రతిమలు ఏర్పాటు చేసే స్టేజ్, వేదికలు సరైన నాణ్యతతో, పటిష్ఠంగా ఉండాలి. వర్షం నుండి రక్షణ కల్పించేలా షెడ్ ఏర్పాటు చేయాలి.
7. మండపం వద్ద 24 గంటలపాటు ఇద్దరు వ్యక్తులు పర్యవేక్షణలో ఉండాలి. రద్దీకి అనుగుణంగా క్యూలైన్లను ఏర్పాటు చే యడంతో పాటు వాలంటీర్లను ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడాన్ని పరిగణలోకి తీసుకోవాలి.
8. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్య నృత్యాలు చేయకూడదు.
9. విధిగా పాయింట్ పుస్తకాన్ని ఏర్పాటు చేయాలి. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినపుడు వారికి సహకరించాలి.
10. మండపాలకు సమీపంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలి.

జూనియర్లకు 'ఎఫ్‌ఆర్‌ఎస్'

- యాప్‌లో హాజరు నమోదు ప్రక్రియ మరూ
- పారదర్శకత పెంచేందుకు కొత్త విధానం
- వసతిగృహాల్లో అమలుపై సందిగ్ధం



లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు నమోదు చేస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందికి అమలులో ఉన్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్(ఎఫ్‌ఆర్ఎస్)ను ఇప్పుడు విద్యార్థులకు కూడా విస్తరించారు. ఈ నెల 23 నుంచి విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో రిజిస్టర్ ద్వారా హాజరు నమోదు జరిగేది. ఈ కొత్త వ్యవస్థ విద్యార్థుల హాజరును కచ్చితంగా ట్రాక్ చేయడంతోపాటు అవకతవకలను నిరోధించడానికి ఉపయోగపడనుంది. కేంద్ర ప్రభుత్వ యుడాయి సంస్థతో సాంకేతిక ఒప్పందం ముగిసినప్పటికీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సహకారంతో ఈ విధానం కొనసాగుతోంది.

హాజరు నమోదు ప్రక్రియ..
మంచిర్యాల జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 165 మంది బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 4,320 మంది విద్యార్థులు చదువుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 11 జూనియర్ కళాశాలల్లో 4,360 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 231 మంది అధ్యాపకులు బోధిస్తున్నారు. హాజరు నమోదు కోసం సీజీజీ సాంకేతిక సహకారంతో టీజీబీఐఈ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో కళాశాల సిబ్బంది తమ మొబైల్ ఫోన్ల ద్వారా విద్యార్థుల హాజరును నమోదు చేస్తున్నారు. ఒకవేళ విద్యార్థి కళాశాలకు హాజరు కాకపోతే, వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. రోజువారీ హాజరు డేటాను రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. తరగతులకు సక్రమంగా హాజరు కాకపోవడమే ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు విఫలమవడానికి ప్రధాన కారణమని గుర్తించిన అధికారులు, ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచాలని భావిస్తున్నారు.

జిల్లాల వారీగా కళాశాలలు, విద్యార్థులు, అధ్యాపకుల వివరాలు..

జిల్లా	కళాశాలలు	విద్యార్థులు	సిబ్బంది (బోధన, బోధనేతర)
మంచిర్యాల	10	4,320	165
కుమురంభీం ఆసిఫాబాద్	11	4360	231

వసతిగృహాల్లో హాజరు సమస్యలు..
వసతిగృహాల్లో పర్యవేక్షణ లోపంతో విద్యార్థుల సంఖ్యపై గందరగోళం నెలకొంది. ప్రస్తుతం ఈ గృహాల్లో మాన్యువల్ రిజిస్టర్ ద్వారా హాజరు నమోదు జరుగుతోంది. మంచిర్యాల జిల్లాలో 17 ఎస్సీ పోస్ట్ మెట్రిక్, 8 ప్రీమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. ప్రీమెట్రిక్ గృహాల్లో 1,208 మంది, పోస్ట్‌మెట్రిక్ గృహాల్లో ఒక్కో హాస్టల్‌లో 120–150 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. పోస్ట్‌మెట్రిక్ గృహాల్లో ఉంటూ కళాశాలల్లో చదివే విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో చేరిన తర్వాత ఆన్‌లైన్‌లో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో మాన్యువల్ పద్ధతిలోనే భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.

బీసీ, ఎస్టీ వసతిగృహాల్లో సవాళ్లు..
జిల్లాలో 18 బీసీ వసతిగృహాల్లో 1,520 మ?ంది విద్యార్థులకు వసతి కల్పించారు. బీసీ గృహాల్లో ప్రవేశం పొందిన వెంటనే ఆన్‌లైన్‌లో పేరు నమోదవుతున్నప్పటికీ, హాజరు నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. 16 ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో 2,600 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది ఎస్టీ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రారంభించినప్పటికీ, స్కాలర్‌షిప్ ప్రక్రియ ఆలస్యం కారణంగా ఈ విధానం సజావుగా అమలు కావడం లేదు. దీంతో అన్ని వసతిగృహాల్లో హాజరు నమోదు మాన్యువల్‌గానే కొనసాగుతోంది.

మొర్రిగూడెం వైపు పెద్దపులి?

తాండూర్: మండల పరిధిలోని మాదారం బీట్‌లోకి ప్రవేశించిన పెద్దపులి ఆనవాళ్లు మళ్లీ అటవీ శాఖ అధికారులు గుర్తించలేకపోయారు. మాదారం, మాదారం–3 ఇంక్‌లైన్ సమీపంలోని అటవీ ప్రాంతాల్లో ఆదివారం పులి జాడ కోసం గాలింపు చేపట్టారు. అయితే పులి పాదముద్రలు కానరాలేదు. మహారాష్ట్రలోని తిప్పేశ్వరం నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అడవుల గుండా మంచిర్యాల జిల్లా కాసిపేట, తాండూర్‌లో తిరుగాడిన పెద్దపులి మళ్లీ అదే మార్గంలో తిర్యాణి మండలం మొర్రిగూడెం అటవీ ప్రాంతంలోకి వెళ్లి ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. తిరిగి తిప్పేశ్వరం అటవీ ప్రాంతానికి వెళ్లే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

సదాస్మరణీయం పుస్తక పరిచయం

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో కవయిత్రి సుబ్బాయమ్మ రచించిన సదాస్మరణీయులు పుస్తక పరిచయం ఆదివారం నిర్వహించారు. సీనియర్ అభియంత సాధుల నందమయ్య, అధ్యాపకులు నోముల చంద్రశేఖర్ రచయిత్రి చిత్రించిన సంఘ సేవకులను, కవులను వారు చేసిన త్యాగనిరతిని కొనియాడాయిని రితీని ఎంతో అద్భుతంగా సమీక్షించారు. రచయిత్రీ సుబ్బాయమ్మ ఎంతో ఓర్పుతో దేశ స్వాతంత్ర్యం కోసం నిస్వార్థ నాయకుల సేవలను కొనియాడుతూ రాసి పుస్తకం చదవటం ద్వారా సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు నిర్వహించిన కవిసమ్మేళనం అలరించింది. సా హితీ సంస్థ జిల్లా అధ్యక్షుడు వామన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు అద్ద గూరి శ్రీలక్ష్మి, సంతోష్, సుగుణాకర్, శ్రీనాథ్‌గౌడ్, సుదాంశ్, పద్మజ, సుజాత కవితాగానం చేశారు.



సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

క్లుప్తంగా

పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



ధ్వంసమైన పంట చూపుతున్న రైతు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన షేక్ అల్మియా అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను శనివారం రాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. సుమారు ఎకరానికి పైగా మొక్కజొన్నతో పాటు పసుపు, పత్తి పంటలను సైతం అడవిపందులు నాశనం చేశాయి. సంబంధిత అధికారులు పంట నష్టంపై అంచనా వేసి పరిహారం చెల్లించడంతో పాటు అడవిపందుల బెడద నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపను ఎడ్లబండ్లలో తరలిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాణహిత నది దయ్యాలమద్రి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్‌కు సమాచారం అందగా డెప్యూటీ రేంజ్ అధికారి రూపేష్, ఎఫ్‌బీవో సోఫియాబేగం అక్కడికి చేరుకుని కలప స్వాధీనం చేసుకున్నారు. ప్రాణహిత నది నుంచి ఎడ్లబండ్ల సాయంతో వేమనపల్లి అటవీ కార్యాలయానికి కలపను తరలించారు. కలప విలువ వివరాలు అధికారులు వెల్లడించలేదు.

చిరుత సంచారం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని అగర్గూడ, గుండెపల్లి పెద్దవాగు పరిసర అటవీ సమీప ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ క్షేత్రాధికారి అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. అటవీ ప్రాంత సమీపంలోని పంట చే లకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకుని గుంపులుగా వెళ్లాలని సూచించారు. చిరుతపులి కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు.


'సమస్యల పరిష్కారానికి నిరసనలు'



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కా రం, కొత్త గనుల సాధన కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీబీజీకేఎస్ నాయకులు తెలిపారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్‌లు మాట్లాడారు. వాస్తవ లాభాలు ప్రకటించి 35శాతం వాటా ను కార్మికులకు పంచాలని డిమాండ్ చేశారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.43 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని పేర్కొన్నారు. అన్ని డి మాండ్ల సాధనకు ఈ నెల 28న అన్ని జీఎం కార్యాయాలు, డిపార్టుమెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి అధికారులకు మెమోరాండం సమర్పిస్తామన్నారు. 29న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, సెప్టెంబర్ 2న చలో కొత్తగూడెం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, గొర్ల సంతోష్, నాయకులు తొంగల రమేశ్, వెంగళ కుమారస్వామి, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు



పేకాట ఆడుతున్న వారితో పోలీసులు

కౌటాల: మండలంలోని తాటినగర్ గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను ఆదివారం రాత్రి కౌటాల పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తాటినగర్ గ్రామంలో పేకాట ఆడుతున్న విశ్వేశ్వర్‌రావు, శంకర్, యం.రవి, కె.బాబురావ్, ఆర్.దివాకర్, జి.నాగేశ్, కె.మారుతి, జి.బాపు, సంతోష్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.10,300 నగదు, 5 సెల్‌ఫోన్లు, 52 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమానా గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై వాంకిడి పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమాన గ్రామ శివారులో పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించగా ఐదుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,820 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మితిమీరితే అనర్థమే..!



నెన్నెలలో వరి పంటకు ఎరువు వేస్తున్న రైతు

ఉమ్మడి జిల్లాలోని రైతులు పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులే లక్ష్యంగా యూరియా, డీఏపీ తదితర ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. రైతులు ఎక్కువగా పత్తి, వరి పంటలు సాగు చేస్తుండగా పంటల్లో ఎరువుల వాడకంపై వారికి అవగాహన ఉండటం లేదు. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సూచనలు పట్టించుకోకుండా ఇతర రైతులు వాడుతున్నారని అవసరం ఉన్నా, లేకున్నా ఎడపెడా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారడంతో పాటు పెట్టుబడులు పెరిగి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎరువుల యాజమాన్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

– మంచిర్యాలఅగ్రికల్చర్

- పెరిగిన రసాయనిక ఎరువుల వినియోగం
- నిస్సారమవుతున్న నేలలు
- పంటలకు చీడపీడల ముప్పు
- ఎరువుల యాజమాన్యంపై అవగాహన తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో 16.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా పత్తి పంట 10.30 లక్షల ఎకరాల్లో, వరి పంట 4.20 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్, రబీలో మొత్తంగా 3.80 లక్షల టన్నుల రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి భూములు 70శాతం ఉండగా 30 శాతం వరకు ఎర్ర, చౌడు తదితర నేలలు ఉన్నాయి.

ఎరువుల అధిక వినియోగం..

రైతులు పంటల ఎదుగుదలకు, దిగుబడులకు నాలుగైదు దఫాలుగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతోపాటు తెగుళ్ల నివారణ కోసం ఏళ్ల తరబడి రసాయనిక ఎరువులు, పురుగు మందులను పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారు. రైతులు దిగుబడి లక్ష్యంగా అవగాహన లోపంతో అవసరం లేకున్నా ఎరువులు, పురుగుల మందులు వాడుతూ ఆర్థికంగా, నేలనిస్సారంగా మారి నష్టపోతున్నారు. ఏటా ఉమ్మడి జిల్లా రైతులు ఎరువులకు రూ.340 కోట్ల వరకు, పురుగు మందులకు రూ.230 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల పచ్చని పొలాలు విషతుల్యమవుతుండగా, దిగుబడుల కంటే పెట్టుబడులే ఎక్కువై అప్పుల పాలవుతున్నారు. సేంద్రియ ఎరువులు తగ్గించి రసాయనిక మందులు వాడడం వల్లనే ఈ దుస్థితి నెలకొంటుంది.

మూడు విడతలుగా యూరియా..

వరిపైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతుంది. దీనిని మూడు దఫాలుగా పొలంలో చల్లుకోవాలి. నాట్లు వేసే ముందు, ఎదిగే దశలో, పొట్టకు వచ్చే దశలో నత్రజనిని అందించే ఎరువులు వాడుకోవాలి. నత్రజని పోషకాన్ని సరైన మోతాదులో పంటకు అందించేందుకు యూరియా వాడే విధానంపై రైతులకు అవగాహన ఉండాలి. ఎకరానికి 25 నుంచి 32 కిలోల నత్రజని అందించాలంటే 55 నుంచి 70 కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమ భాగాలుగా విభజించి చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన రీతిలో లేకుంటే అదనంగా 10 నుంచి 15 కిలోల వరకు యూరియా వాడొచ్చు. యూరియా అధిక వినియోగం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయి. యూరియా ఎక్కువైతే వరి మొక్కల ఆకుల్లో పత్రహరితం అధికంగా ఉండి పురుగులు దాడి చేస్తాయి. అగ్గితెగులు, ఆకుముడుత తెగులు కూడా సోకే ప్రమాదం ఉంటుంది.

సకాలంలో భాస్వరం..

మొక్కల వేరుల పెరుగుదల పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీనిని నాట్లు వేసే ముందు దమ్ములో లేదా నాట్లు వేసిన 15 రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాల్సి ఉంటుంది. నాట్లు వేసిన 15 రోజుల తరువాత ఈ ఎరువును పొలంలో చల్లుకున్నా ఉపయోగం ఉండదు. అయితే పొలంలో జింక్‌లోపం తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ ఎరువును సకాలంలో పైరుకు అందిస్తేనే మొక్కల ఎదుగుదల బాగుంటుంది.

పొటాష్‌తో రోగ నిరోధక శక్తి..

రోగ నిరోధక శక్తి పెంచడానికి, అవసరమైన పోషకాలను మొక్కలోని వివిధ భాగాలకు సరఫరా చేయడానికి పొటాష్ ఉపయోగపడుతుంది. పంటకు అవసరమయ్యే మొదటి దఫాలో 12 నుంచి 16 కిలోలు, రెండో దఫాలో 20 నుంచి 27 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలంలో చల్లుకోవాలి. దీనిని రెండు సమభాగాలుగా చేసి మొదటి దఫా, రెండో దఫా యూరియాతో కలిపి వేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చు.



పత్తిలో ఎరువు వేసేందుకు సిద్ధం చేస్తున్న రైతు

మోతాదు మించొద్దు..

ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉన్నా అందులో నత్రజని లోపం అధికంగా ఉంది. చౌడు భూముల్లో జిప్సం, సల్ఫర్ లోపం ఉంది. పత్తి, వరి సాగు అధికంగా చేస్తుండగా దిగుబడికి రైతులు రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బ తింటుంది. రైతులు పంట మార్పిడి చేస్తే దిగుబడులు పెరుగుతాయి. సేంద్రియ ఎరువులు పశువుల పేడ, పచ్చిరొట్టె ఎరువులు, వర్మీ కంపోస్టు వేసుకుంటే నత్రజని లోపం అధిగమించవచ్చు.

– రాజశేఖర్, శాస్త్రవేత్త, ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం

రాయిపై గణపతి రూపం



స్వయంభూగా వెలసిన గణపతికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

- పూజలు చేసిన భక్తులు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామ శివారులో ఉన్న గుట్టపై రాతి గణపతి వెలిసింది. బండరాయి కింద గణపతి రూపం కనిపించడంతో గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేస్తున్నారు. ఆదివారం కోతల్‌గాం గ్రామస్తులు భజనలు చేస్తూ వాయిద్యాలతో వెళ్లి పూజలు నిర్వహించారు.

మొదటగా కాపర్లకు..

గ్రామస్తులు, భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న పశువులు, గొర్రెలు మేపేందుకు కాపర్లు గుట్టపైకి ఎక్కారు. ఆ సమయంలో వర్షం పడింది. వర్షానికి ఓ బండరాయి తడవక పోవడంతో సురేశ్ అనే వ్యక్తి అక్కడికి వెళ్లి తోటి కాపర్లను పిలిచాడు. బండరాయి వాన నీటికి తడవకపోవడంతో వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. వారికి బండరాయి కింద మరోరాయి గణపతి రూపంలో కనిపించింది. దీంతో గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. బండరాయి కింద గణపతి వెలసిందన్న విషయం తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు

- చాంపియన్లుగా ఆదిలాబాద్, వరంగల్ జట్లు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో కొనసాగుతున్న 71వ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆదిలాబాద్ మహిళ జట్టు విజేతగా నిలువగా పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా జట్టు విజయకేతనం ఎగురేసింది. ఆదివారం సెమీఫైనల్‌తో పాటు ఫైనల్ పోటీలు నిర్వహించగా క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఫైనల్‌లో ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు వరంగల్ జట్టుతో తలపడింది. పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా క్రీడాకారులు రంగారెడ్డి జిల్లాతో తలపడ్డారు.

పోటీలతో స్నేహభావం..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణతో వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్వోటూజీఎం రాజమల్లు, బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఒలంపిక్ అసోషియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో నిందితురాలి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: పెళ్లి సంబంధం ఉందని నమ్మబలికి కుటుంబ సభ్యులను బురిడీ కొట్టించి ఆ ఇంట్లోనే దొంగతనం చేసిన నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ చందవోలు హనోక్ వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన ఇందూరి చంద్రశేఖర్ తమ్ముడికి పెళ్లి సంబంధం చూస్తానని గొల్లగూడెం (కన్నాల)కు చెందిన పుల్లగొర్ల పుష్పలత ఈ నెల 22న ఫోన్ చేసి మంచిర్యాలకు రావాలని సూచించింది. దీంతో చంద్రశేఖర్ కుటుంబసభ్యులతో మంచిర్యాలకు వెళ్లాడు. పథకం ప్రకారం పుష్పలత చంద్రశేఖర్ ఇంటి తాళం పగులకొట్టి బీరువాలోని రూ.2 లక్షల విలువ చేసే రెండు తులాల బంగారు నక్లెస్, రూ.15 వేల నగదు అపహరించింది. చంద్రశేఖర్ ఇంటికి వచ్చే సరికి బీరువా తాళం పగలకొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పుష్పలత తన ఇంటికి వచ్చి వెళ్లిన విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఆ కోణంలో విచారణ చేపట్టారు. ఆదివారం పుష్పలత శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే కమాన్ వద్ద ఉందని అందిన సమాచారంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై బండి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనోక్

చోరీ చేసి.. రైలెక్కి..!


- కాగజ్‌నగర్ పట్టణంలోని నగల షాపులో దొంగతనం
- వెండి ఆభరణాలతో రైలులో పరారైన మహిళలు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా సమీపంలోని బ్రహ్మానందం అండ్ సన్స్ జ్యువెలరీ షాపులో గుర్తు తెలియని నలుగురు మహిళలు దొంగతనానికి పాల్పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం షాపులోకి వచ్చిన ముగ్గురు మహిళలు తమకు పట్టగొలుసులు కావాలని షాపు నిర్వాహకులను అడిగారు. దీంతో వారు పట్టగొలుసులను బయటకు తీసి చూపెట్టారు. ఈ క్రమంలో అదే గ్రూప్‌నకు చెందిన మరో మహిళ షాపులోకి వచ్చి తనకు మట్టెలు కావాలని అడిగి మిగితా మహిళల పక్కన నిల్చొంది. ఈక్రమంలో షాపు నిర్వాహకులను బురిడీ కొట్టించి సుమారు రూ.1.50 లక్షల వెండి ఆభరణాలను వారు దొంగిలించారు. షాపు యజమానికి అనుమానం వచ్చి నిలదీయగా తమకు ఏం తెలియదంటూ షాపు నుంచి వెళ్లిపోయారు. దీంతో షాపులోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా దొంగతనం బయటపడింది. వెంటనే షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. మహిళల జాడ కోసం పోలీసులు గాలించగా మహిళలు కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి వెళ్లిపోయినట్లు తెలిసింది. కాగా సీఐ ప్రేంకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై కాగజ్‌నగర్ పట్టణ సీఐ ప్రేం కుమార్‌ను సంప్రదించగా నలుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నామని, వరంగల్ జిల్లాకు చెందిన వారిగా అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.



నగల షాపులో చోరీకి వచ్చిన గుర్తు తెలియని మహిళలు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాలలో 1999 -2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో 25 ఏళ్ల తర్వాత విద్యార్థులంతా చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజ్ మహ్మద్, అనిల్, వేణుగోపాల్, కుమార్, అంజయ్య, సువర్చల, అనంతలక్ష్మి, రుక్సాన, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాలో రెండిళ్లలో..

భైంసాటౌన్: పట్టణంలో చోరీలు కలకలం రేపుతున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. రెండురోజుల వ్యవధిలో రెండిళ్లలో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని భోకర్ తాలూకా దివిసి గ్రామానికి చెందిన జోగుదాండే మారుతి భైంసా పట్టణంలోని సాయినగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడం గమనించిన ఇంటి యజమాని ఆయనకు సమాచారమిచ్చాడు. దీంతో మారుతి వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. కాగా గీతానగర్‌లోని మరో ఇంట్లో అద్దెకు ఉంటున్న విశ్వనాథ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హంపోలి గ్రామానికి చెందిన విశ్వనాథ్ గురువారం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లాడు. శుక్రవారం ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన ఇంటి పక్కవారు అతనికి సమాచారమిచ్చారు. అతను అక్కడకు చేరుకుని చూడగా, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఈ ఘటనలో తులంన్నర బంగారం, 10 తులాల వెండి, రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.



సాయినగర్‌లోని ఇంట్లో చిందరవందరగా వస్తువులు

'ఆదివాసీ సభకు అనుమతి ఇవ్వకపోవడం సరికాదు'

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి సంఘీభావ వేదిక సభకు అనుమతి ఇవ్వకపోవడం ఆదివాసీలను అవమానించడమేనని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అన్నారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆదివారం మావల మండలం బట్టిసావర్‌గాం శివారు కుమురంభీంగూడలో నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలపై మారణహోమం సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు ఇందిరా, లలిత, గణపతి, మావల మండల అధ్యక్షుడు ముకుందరావు, నాయకులు రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఆదే శేఖర్ (ఫైల్)

దహెగాం: మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన ఆదే శేఖర్ (25) అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శేఖర్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను అడగ్గా వారు నిరాకరించారు. మనస్తాపానికి గురై ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి శేఖర్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఆదే లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులబాధతో..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని దేవల్‌నాయక్ తండాకు చెందిన చౌహాన్ అంకుష్ (42) అనే రైతు అప్పులు పెరగడంతో ఈనెల 11న పురుగుల మందు సేవించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పంట చేనులో పురుగుల మందు తాగగా, గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

తక్కువ మార్కులు వచ్చాయని..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన ఓ విద్యార్థిని మృతిచెందినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని మహారాష్ట్రలోని మాహోర్ తాలుకా బౌన్‌గూడకు చెందిన రాథోడ్ ప్రేరణ (16) శనివారం పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. తండ్రి అశ్విన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కడుపునొప్పి భరించలేక..



దోకె అజయ్ (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గుడిపేట శివారులోని దుబ్బపల్లిలో చోటు చేసుకుంది. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు.. దుబ్బపల్లికి చెందిన దోకె అజయ్(23) నెల రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ కరీంనగర్‌లోని చల్మెడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారం రోజులుగా భరించలేనంత నొప్పి ఉండటంతో 21వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.